
# సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించండి

- మున్సిపల్ కమీషనర్ శివరామకృష్ణ

తాడిపత్రిటౌన్, జనవరి 20 ప్రభాతవార్త



మున్సిపల్ కమీషనర్ శివరామకృష్ణ

పట్టణ ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు, కొళాయి పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమీషనర్ శివరామకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, కొళాయి పన్నులు వసూలు వేగవంతం చేసి వంద శాతం లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేసే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సంబంధిత అధికారులు, వార్డు సచివాలయం కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. పన్ను ఎగవేతదారుల విషయంలో ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేసేందుకు ప్రణాళికలు రూపొందించి అట్లు బకాయి పన్నులు వసూలు కాని పక్షంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం 1965 ప్రకారం నీటి కొళాయిలు తొలగించడంతో పాటు అత్యవసర సర్వీసులు రద్దు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని పట్టణ కార్యదర్శులకు తెలియచేశారు. పన్నులను మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్లలో గాని, సిడిఎంఎ వెబ్‌సైట్‌లో గాని, పురసేవ అప్లికేషన్‌లో గాని చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని ఆయన తెలియచేశారు.

# అగాపే ఆశ్రమంలో అన్నదానం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

యాడికి, జనవరి 20 ప్రభాతవార్త

యాడికి మండల కేంద్రం కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాఫర్‌సాహెబ్ (హెడ్‌కానిస్టేబుల్) 24వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం ఆయన భార్య ఖాజాబి, కుమారులు చాంద్‌బాష సత్తార్, కోడళ్ళు, కుమార్తెలు షహనాజ్, షహజాది, మనవాళ్లు, మనవరాలు కుటుంబసభ్యులు ఆశ్రమంలోని నిరాశ్రయులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్, వృద్ధులు వారి కుటుంబానికి ధన్యవాదాలు తెలిపారు.

# దుకాణాల్లో పోలీసుల తనిఖీలు

పెద్దవడుగూరు, జనవరి 20 ప్రభాతవార్త



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గంజాయి, తదితర మత్తు పదార్థాలపై మండలంలోని పాఠశాలలు, కళాశాలల సమీపంలోని దుకాణాలు, పెట్టీ షాపుల్లో మంగళవారం ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, తదితర మత్తు పదార్థాల విక్రయాన్ని అరికట్టేందుకు జిల్లా ఎస్పి జగదీష్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. గంజాయి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పోలీస్‌శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక తనిఖీపై సమావేశం



మాట్లాడుతున్న ఎంపిడిఒ అలివేలమ్మ

పుట్లూరు, జనవరి 20 ప్రభాతవార్త

పుట్లూరు మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశ భవనంలో 18వ విడత సామాజిక తనిఖీపై ఎంపిడిఒ అలివేలమ్మ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ సామాజిక తనిఖీ 2024 ఏప్రిల్ 1వ తేదీ నుండి 2025 మార్చి 31 వరకు జరిగిన 12.44 కోట్ల రూపాయల మేర ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, ఫారెస్ట్ సంబందించి 661 పనులను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీకి సంబంధించి అన్ని శాఖల అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ అలివేలమ్మ, పిఆర్ ఏపిఒ, హౌసింగ్ ఏఈ, సామాజిక తనిఖీ డిఆర్‌పిలు భారతి, లక్ష్మినారాయణమ్మ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు. బుధవారం నుండి మండలంలోని అరకటివేముల, చెర్లోపల్లి గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ ప్రారంభించడం జరుగుతుందని ఎంపిడిఒ తెలియజేశారు.

# కాలబైరవస్వామి ఆలయంలో మాఘమాస పూజలు ప్రారంభం

- రెండు రోజులపాటు ఘనంగా అమావాస్య పూజలు
- కుష్మాండ దీపోత్సవానికి తరలివచ్చిన జనం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం, జనవరి 20 ప్రభాతవార్త బ్యూరో

ధర్మవరం పట్టణంలోని లక్ష్మిచక్రవర్తి థియేటర్ ఎదురుగా ఉన్న శ్రీ స్వయంభు కాలభైరవ స్వామి ఆలయంలో మాఘమాస పూజలు ప్రారంభమయ్యాయి. పూజారి ధనుంజయ ఆచారి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు అమావాస్య పూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి కూష్మాండ దీపోత్సవాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం దీపోత్సవంలో పాల్గొన్నారు. బూడిద గుమ్మడికాయలపై దీపాలు వెలిగించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తర్వాత రోజు కంకణదారణ కార్యక్రమం జరిగింది. స్వామి ఎదుట ఉంచి పూజించిన కంకణాలను పూజారి భక్తులకు అందజేశారు. మాఘమాసం సూర్యభగవానుడితో పాటు పరమ శివునికి అత్యంత విశేషమైన మాసమని.. నెల రోజులపాటు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని పూజారి ధనుంజయ ఆచారి తెలిపారు.

# కర్మాగారంలోని కష్టాలపై కార్మికుల కన్నెర్ర

- విధులు భారం..ప్రమాదాలకు లేదు సాయం



ఫ్యాక్టరీ ముంగిట ధర్నాకు దిగిన కార్మికులు

తాడిపత్రి, జనవరి20, ప్రభాతవార్త

తాము పనిచేస్తున్న కర్మాగారంలో కష్టాలు పడలేకున్నామని కార్మికులు కన్నెర్ర చేసి ఆందోళనకు దిగిన సంఘటన తాడిపత్రి రూరల్ పరిధిలోని భోగసముద్రం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక సుగుణ స్పాంజ్ అండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు తమకు విధులు భారంగా మారాయని, ప్రమాదాలు జరిగినా సాయం అందించడం లేదంటూ నిరసన చేపట్టారు. కర్మాగారం ప్రధాన ద్వారం వద్ద రోడ్డుమీద బైఠాయించి తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. రోజుకు మూడు పర్యాయాలు చొప్పున ఒక్కో పర్యాయం 8 గంటలు పనిచేయాల్సి ఉండగా 12 గంటల వంతున రెండు పర్యాయాల్లోనే పని పూర్తి చేయిస్తున్నారని, పని ముగింపు తర్వాత మరొకరు విధుల్లోకి రావాల్సి ఉండగా తమతోనే అదనపు పని చేయిస్తు న్నారని కార్మికులు వాపోయారు. కర్మాగారంలో ఏవైనా ప్రమాదాలు చోటు చేసుకుంటే కార్మికుల కష్టాలను కంపెనీ యాజమాన్యం పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళాకార్మికులు కూడా చలిని లెక్క చేయకుండా రాత్రి వరకు నిరసనలో పాల్గొన్నారు. అనారోగ్య సమస్యలున్నా అలాగే పనులు చేయిస్తున్నారని, ఏదైనా ప్రమాదం జరిగితే లోలోపలే తొక్కిపెట్టి ప్రథమ చికిత్సతో సరిపెడుతున్నారని, కార్మికశాఖ అధికారులు కూడా తమ దుస్థితిపై స్పందించడం లేదని వారు వాపోయారు. యాజమాన్యం తమ హక్కుల అంగీకారానికి దిగివచ్చే వరకు నిరసన ఆపేది లేదని రాత్రి కూడా అక్కడే కార్మికులు బస ఏర్పాట్లు చేసుకోవడం గమనార్హం. ఏపీ, తెలంగాణాకు చెందిన 270 మంది కార్మికులతో పాటు రాజస్థాన్, గుజరాత్, ఒరిస్సా,బీహార్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన వారు సుమారు 700 మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది.

# మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కాటయ్య

తాడిపత్రిఅర్బన్, జనవరి 20 ప్రభాతవార్త

మత్తుపదార్థాలతో జీవితాలు నాశనమవుతాయని రూరల్ ఎస్ఐ కాటయ్య తెలియచేశారు. మత్తుపదార్థాల వల్ల కలుగు అనర్థాలపై మంగళవారం తాడిపత్రి పట్టణ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మత్తుపదార్థాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయన్నారు. వీటి వ్యసనానికి గురైతే జీవితం దారి తప్పి తద్వారా కుటుంబానికి, సమాజానికి నష్టం కలుగుతుందన్నారు. ముఖ్యంగా యువత మత్తుపదార్థాలకు దూరంగా వుండాలన్నారు. వీటికి అలవాటు పడితే మంచి బంగారు భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. కావునా విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా వుంటూ బాగా చదివి వారు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎస్ఐ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భవవాన్ని వాడుకలోకి తేవాలని తహశీల్దార్‌కు వినతి

యాడికి, జనవరి 20 ప్రభాతవార్త



వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

యాడికి మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదురుగా నిర్మించిన భవనాన్ని వాడుకలోకి తేవాలని ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు పాతకుట్ల బాలు మాదిగ మంగళవారం తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో 2019 ఫిబ్రవరి 23న భవనాన్ని ప్రారంభోత్సవం చేయడం జరిగిందన్నారు. కానీ ఈరోజుకు వాడుకలో లేదన్నారు. ఇందుకు కారణం మండలానికి చెందిన ఒక ఎస్‌సి మహిళ ఆమెకు ఎస్‌సి కోటాలో వ్యాపారం చేసుకోవడానికి ఒక రూము కావాలని కోర్టులో కేసు వేసిందన్నారు. దీంతో భవనం వాడుకలో లేకుండా పోయిందన్నారు. కావునా ఆమెతో మాట్లాడి ఎస్‌సిలకు వేరుగా వేలం పాట పెట్టించి భవనాన్ని ప్రారంభించాలన్నారు. భవనం వాడుకలో లేక ప్రభుత్వానికి గ్రామపంచాయతీ ఆదాయానికి గండి పడుతోందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేసే వాళ్లకు కూడా జీతాలు ఇవ్వలేని పరిస్థితి వస్తుందన్నారు. దీనికి వచ్చే ఆదాయంతో యాడికి మేజర్ పంచాయతీలో చాలా అభివృద్ధి పనులు చేయవచ్చన్నారు. కావునా ఈ సమస్యను పరిగణలోకి తీసుకొని వెంటనే పరిష్కరించాలని తమరి ద్వారా కలెక్టర్‌ను, ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఆయన పేర్కొన్నారు.

# ఫ్యాక్షన్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

- రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ శివగంగాధర్‌రెడ్డి

తాడిపత్రిఅర్బన్, జనవరి 20 ప్రభాతవార్త

ఫ్యాక్షన్ కార్యకలాపాలకు దూరంగా వుండాలని తాడిపత్రి రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన వీరాపురంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శాంతిభద్రతలను ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఏవైన సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో గొడవలు పడడం, గ్రూప్ రాజకీయాలు చేయడం, ఫ్యాక్షన్ కార్యకలాపాలు కొనసాగించడం వంటివి మానుకోవాలన్నారు. అలా కాకుండా చట్టాన్ని అతిక్రమిస్తే తమదైనశైలిలో కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని సిఐ హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మత్తుపదార్థాల వల్ల కలుగు అనర్థాలు, రహదారి భద్రత గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా కాశిరెడ్డినాయనకు ప్రత్యేకపూజలు

పెద్దపప్పూరు, జనవరి 20 ప్రభాతవార్త



పెద్దపప్పూరులో వెలసిన శ్రీకాశిరెడ్డినాయన ఆశ్రమంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాశిరెడ్డినాయనకు అభిషేకాలు, అర్చనలు, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో పాటు ఆకుపూజలు చేపట్టారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

# అంగన్‌వాడీలకు పెండింగ్‌లో ఉన్న పాత బకాయిలను వెంటనే చెల్లించాలి

- ఎఐటియుసి నాయకులు డిమాండ్



సిడిపిఓ రాధికాకు వినతిపత్రం అందజేస్తున్న ఎఐటియుసి నాయకులు

కదిరి, జనవరి 20 ప్రభాతవార్త

మంగళవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కదిరి సిడిపిఓ రాధికాకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజినేయులు మాట్లాడుతూ.. 2021 ఆగస్టు నుంచి 2022 సెప్టెంబర్ వరకు, 2023 ఫిబ్రవరి నుంచి 2024 వరకు కూరగాయలకు సంబంధించిన 18 నెలల బిల్లులు అప్పట్లో విధులు నిర్వహించిన సిడిపిఓ నిర్లక్ష్యం కారణంగా కదిరి ప్రాజెక్టులోని అర్బన్ రూరల్ పరిధిలో ఒక్క సెంటర్ కూడా రాలేదన్నారు. గతంలో నుంచి కలెక్టర్, పిడిల దృష్టికి తీసుకెళ్లినా తమ సమస్య పరిష్కారం కాలేదన్నారు. గతంలో పని చేసిన సిడిపిఓ తప్పిదం వల్ల 18 నెలల పెండింగ్ బకాయిలు నిలిచిపోయి అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పిడిలు స్పందించి తమకు రావాల్సిన బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పవన్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి మధునాయక్, కదిరి ప్రాజెక్టు అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ, సుశీల, శకుంతల, రమాదేవి, రమణమ్మ, లక్ష్మీదేవి, శారద, మాధవి, లక్ష్మి, శాంతిలు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని

# సుందర వనముగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పంచాయతీ కార్యదర్శి సర్దార్ వలి.

అనంతపురం రూరల్ జనవరి 20 ప్రభాతవార్త



మొక్కలు నాటిస్తున్న దృశ్యం

అనంత రూరల్ మండలం కురుకుంట గ్రామంలోని చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని సుందర వనముగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు ఆ ఆవరణమును శుభ్రంగా ఉంచడం జరుగుతుందని ఆ పంచాయతీ గ్రేడ్ 2 కార్యదర్శి సర్దార్ వలి పేర్కొన్నారు. మంగళవారం చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్ర ఆవరణములో ఆయన కార్మికులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మండల అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీలోని చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్ర ఆవరణ మొత్తం పరిశుభ్రంగా ఉంచడంతోపాటు సుందర వనముగా తీర్చిదిద్దాలని తెలపడంతో ఆవరణ మొత్తం పరిశుభ్రంగా ఉంచి అక్కడ మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఈ ఆవరణం పరిశుభ్రంగా ఉండడంతో నే వీటిని చూసి గ్రామంలోని ప్రజలందరూ వారి వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచాలనే విధంగా ఈ ఆవరణాన్ని వారికి చూపించడం జరుగుతుందన్నారు.

# అంత్యక్రియలకు హాజరైన మాజీ మంత్రి పల్లె

అమడగూరు, జనవరి 20 ప్రభాతవార్త



నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ఆమడగూరు మండలం కమ్మవారిపల్లిలో గుండె పోటుతో మృతి చెందిన టిడిపి మద్దతుదారుడు, రాగులపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవర వేణుగోపాల్‌నాయుడు అంత్యక్రియలకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి హాజర య్యారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ నాయుడు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం దేవర వేణుగోపాల్‌నాయుడు కుటుంబసభ్యులు శ్యామల, కుమార్తె లాస్య, కుమారుడు హర్షిత్‌లను పల్లె రఘునాథ్‌రెడ్డి పరామర్శించి ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు, ఈ అంత్యక్రియల్లో మాజీ జెడ్‌పిటిసి శ్రీనివాస్‌రెడ్డి, టిడిపి యువ నాయకుడు శ్యాంబాబు, కూటమి నాయకులు వెంకటరెడ్డి, గోవిందు, నంజప్ప, వల్లెపు సోమశేఖర్, రఘువీర, ప్రభాకర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, దివాకర్, నాగేంద్ర, రాజారెడ్డి, చినగానిపల్లి పంచాయతీకి చెందిన టిడిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# గొడవలు పడితే కఠిన చర్యలు - ఎస్ఐ




గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

పెద్దవడుగూరు, జనవరి 20 ప్రభాతవార్త

గ్రామాల్లో గొడవలు పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని లక్షుంపల్లి గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలన్నారు. అలాగే ప్రజలకు సైబర్ నేరాలు, డయల్ 100, దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అదేవిధంగా భూమి సమస్యలు, గట్టు సమస్యలు ఏవైనా ఉంటే చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలన్నారు. ఎవరైనా గొడవలు పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మట్కా, పేకాట ఇతర అసాంఘిక కార్యకలాపాలపై పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నవీన్ నియామకం పై హర్షం

ముదిగుబ్బ జనవరి 20 ప్రభాతవార్త.



భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షునిగా నితిన్ నబీన్ ఎన్నిక కావడం దేశమంతా పార్టీ శ్రేణులు అపార హర్షాన్ని కలిగించింది. బిజెపి జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షులు సోముల ప్రకాష్ వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన పత్రిక ప్రకటన విడుదల చేస్తూ నితిన్ నబీన్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రకాష్ మాట్లాడుతూ నితిన్ నబీన్జాతీయఅధ్యక్షుడుఎన్నిక కావడం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బిజెపి శక్తిని మరింత పెంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీకి అంకితభావంతో పనిచేసిన నాయకుడికి అత్యున్నత బాధ్యతలు అప్పగించడం బిజెపి ప్రత్యేకత అని ఆయన అన్నారు. 45 ఏళ్ల వయసుకే ఐదు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి రెండుసార్లు మంత్రి పదవులు చేపట్టడం ద్వారా నితిన్ నవీన్ తమ పరిపాలనసామర్థ్యాన్నిచాటుకున్నారని కొనియాడారు. రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందిన యువనాయకుడిగా ఆయన ఎదుగుదల గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. పార్టీసిద్ధాంతాలు క్రమశిక్షణ నాయకత్వ లక్షణాలు కలిగిన నితిన్ నవీన్ శక్తిసామర్థ్యాలను గుర్తించిన బిజెపి అధిష్ఠానం ఆయనకు జాతీయఅధ్యక్షపదవిఅప్పగించిందని తెలిపారు. ఇది పార్టీ బలాన్ని భవిష్యత్తులోస్పష్టంగా సూచిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వెంకటేష్ జనగాని నాగభూషణ దేశ నారాయణ పివి శివకుమార్ జాస్తి అశోక్ కుమార్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

తలుపుల,జనవరి20, ప్రభాతవార్త



పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ను మంగళవారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లో రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, విధులు పట్ల అంకిత భావంతో పనిచేయాలని ఎస్,ఐ. చెన్నయ్యకు తెలియజేశారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మంచిగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు కదిరి డి.ఎస్.పి శివ నారాయణస్వామి, రూరల్ సి.ఐ నాగేంద్ర పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ అకస్మికంగా తనిఖీ

నంబులపూలకుంట, జనవరి 20 ప్రభాతవార్త



పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ

కదిరి నియోజకవర్గం నంబులపూలకుంట మండలం స్థానిక పోలీస్ స్టేషన్ ను మంగళవారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అకస్మికంగా తనిఖీ చేశారు. విధుల పట్ల అలసత్వం వహించరాదని నిబద్ధతతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని, పిర్యాదుదారులతో మంచిగా మాట్లాడాలని ఎస్ఐ క్రిష్ణమూర్తికి కు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఎస్పీ వెంట డిఎస్పి శివనారాయణస్వామి, రూరల్ సీఐ నాగేంద్ర స్థానిక పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# రోడ్డు నిబంధనలతో ప్రమాదాలకు అడ్డుకట్ట : ఆర్టీఓ శ్రీనివాసులు



రోడ్డు నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఆర్టీవో

ఓబుళదేవరచెరువు, జనవరి 20, ప్రభాతవార్త

రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు గురికాకుండా ప్రయాణాలు సాగించవచ్చని కదిరి ఆర్టీఓ శ్రీనివాసులు, ఎం.వి.ఐ వరప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీ విజ్ఞాన్ (సిబిఎస్ఈ) పాఠశాలలో మంగళవారం జాతీయ రహదారుల మాసోత్సవం పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్టీవో మాట్లాడుతూ... సెల్ ఫోన్లో మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరం అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు వాడటం ఎంతో శ్రేయస్కరం అన్నారు. అలాగే ఇతర వాహనాల డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలకు గురయ్యా అవకాశం ఉందన్నారు. అనంతరం కొండకమర్ల కూడలిలో ఆటో, జీపు డ్రైవర్లకు రోడ్డు నిబంధనలు, పాటించాల్సిన నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మల్లికార్జున రెడ్డి, శ్రీవిజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# హుండీ లెక్కింపు కార్యక్రమం

నల్లచెరువు జనవరి 20, ప్రభాతవార్త



హుండి లెక్కిస్తున్న సిబ్బంది

మండల పరిధిలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పాలపాటి దీన్ని ఆంజనేయస్వామి దేవస్థానం నందు మంగళవారం దేవాదయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి ఎన్ ప్రసాద్. సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో శాశ్వత హుండి లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ లెక్కింపు కార్యక్రమంలో (25/08/2025 నుండి 20/01/2026 వరకు ) స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు కానుకలు ముదుపులు సమర్పించిన మొత్తం 2,55,395/ రూ, లు వచ్చినదని ఈ మొత్తాన్ని దేవాదాయ శాఖ ఖాతాలో జమ చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు భక్తాదులు పాల్గొన్నారు.

# పశు ఆరోగ్య వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

నల్లచెరువు, జనవరి 20, ప్రభాతవార్త



పశువులకు వైద్య చికిత్సలు చేస్తున్న డాక్టర్ మల్లికార్జున

మండల పరిధిలోని జోగన్నపేట, పోలేవాండ్లపల్లిలో గ్రామాలలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాలు ఏ డి శివప్రసాద్ రాజు, డాక్టర్ మల్లికార్జున ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో 47 పశువులకు చికిత్స నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ పశు రైతులు పశువులకు సీజన్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా గర్భ కోశ సంబంధ చికిత్సలు 16 ఆవులకు చికిత్స చేసామని, 26 దూడలకు ఏలిక పాము మందులు తాపించామని గొర్రెలకు నట్టల నివారణకు మందులు పంపిణీ చేశామని ప్రభుత్వం పశు భీమ (ఇన్సూరెన్స్) గురించి గ్రామ ప్రజలకు అవగహన కల్పించారు, ఈ హెల్త క్యాంపులో ఎల్ స్ ఏ భాను, అన్ని సచివాలంల ఏ ఎహ్ ఏ లు, గోపాల మిత్రాలు పాల్గొన్నారు.

# క్యాట్ ఒలంపియాడ్ రెండవ లెవెల్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థుల విజయభేరి

అనంతపురం న్యూటౌన్, జనవరి 20 ప్రభాతవార్త

క్యాట్ ఒలంపియాడ్ రెండవ లెవెల్ ఫలితాలలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందినటువంటి శ్రీ చైతన్య విద్యార్థులు అత్యధికంగా క్యాష్ ప్రైస్ మరియు గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్లు గెలుచుకున్నారని శ్రీ చైతన్య విద్యాసంస్థల అనంతపురం జోన్ ఏజీఎం సుబ్బారెడ్డి తెలియజేశారు. ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గణితం, భౌతిక శాస్త్రం మరియు రసాయన శాస్త్రాల లో నిర్వహించిన క్యాట్ ఒలంపియాడ్ రెండవ లెవెల్ ఫలితాలలో 1000/ల క్యాష్ ప్రైజ్ ను 214 మంది విద్యార్థులు, రూ.2000 క్యాష్ ప్రైజ్‌ను ఆరుగురు విద్యార్థులు మొత్తంగా 220 మంది విద్యార్థులు రూ.2,26,000/ను క్యాష్ ప్రైస్, గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్స్ గెల్చుకొని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచారని తెలియజేశారు.

## మాజీ సీఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిను కలిసిన వై.విశ్వేశ్వరరెడ్డి, వై.ప్రణయ్‌రెడ్డి

**- తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వక భేటి**

ఉరవకొండ, జనవరి 20 ప్రభాతవార్త



మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిను కలిసిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, యువనేత వై.ప్రణయ్‌రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిను మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఉరవకొండ నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, విద్యార్థి విభాగం రాయలసీమ జోనల్ వర్కింగ్ ప్రసిడెంట్ వై.ప్రణయ్‌రెడ్డి కలిపారు. మంగళవారం తాడేపల్లి లోని క్యాంపు కార్యాలయంలో ఈ మర్యాదపూర్వక భేటి జరిగింది. ఈ సందర్భంగా ఇరువురు నేతలు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితో ఉరవకొండ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీను మరింత బలోపేతం చేయడం, తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో చేకూరిన ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి వారికి సూచించారు.

## ఘనంగా కొల్హాపురి మహాలక్ష్మి జాతర వేడుకలు

అగళి, జనవరి 20 ప్రభాతవార్త



మండల పరిధిలోని పూల పల్లి గ్రామంలో కొల్హాపురి మహాలక్ష్మిదేవి వేడుకలు గత రెండు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. రత్నగిరి గ్రామంలో వెలిసిన మహాలక్ష్మి అమ్మవారిని మేళతాళాలతో డప్పు వాయిద్యాలతో, వేద పండితుల మంత్రోచ్చారణలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను రత్నగిరి నుంచి ఊరేగింపుగా పూల పల్లి గ్రామానికి తీసుకొచ్చారు. పూలపల్లి గ్రామంలో ప్రత్యేకంగా దేవతను కూర్చో బెట్టడానికి మామిడి అరటి తోరణాలతో పందిరి వేసి శాస్త్రోక్తంగా కూర్చోబెట్టారు. వివిధ ఆభరణాలతో రంగురంగు పూలతో మహాలక్ష్మిని అలంకరించారు. మండలం నుంచే కాకుండా చుట్టు పక్క గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ఈ జాతర మహోత్సవానికి భక్తులు పాల్గొన్నారు. మహా మంగళహారతి పూజల అనంతరం వచ్చిన అతిథులు, భక్తులకు గ్రామస్తులు విందు బోజనాలను ఏర్పాటు చేశారు. జడ్పిటిసి ఉమేష్, ఎంపిపి రేణుకా కామరాజు, సర్పంచు నరసింహమూర్తి, వేడుకలను పర్యవేక్షించారు. ఎస్ఐ శోభరాణి సిబ్బందితో ఎలాంటి సంఘటనలో చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వాటర్ ప్లాంట్ భవన పరిశీలన చేసిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

అమరాపురం జనవరి 20 ప్రభాతవార్త



పరిశీలిస్తున్న ఆర్డబ్ల్యూఎస్ అధికారి దృశ్యం

మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామానికి హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి కే పార్థసారథి ఆదేశాల మేరకు వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఆర్డబ్ల్యూఎస్ డి ఈ మను నాయక్ మంగళవారం భవన పరిశీలన చేపట్టారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకువాటర్ ప్లాంట్ మంజూరు చేయాలని స్థానిక టిడిపినాయకులు ఎంపీకి విన్నవించడం విధితమే. తక్షణమే స్పందించినహిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారథి అధికారులతో మాట్లాడి వారంలోపు మంజూరు చేయిస్తానని హామీ ఇవ్వడం ద్వారా అధికారులు విచ్చేసి గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు పరిశీలన మరియు ఇతర వసతుల ఏర్పాటుపై ఎస్టిమేషన్ సిద్ధం చేయడానికి విచ్చేసినట్లు మను నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పి ఆర్ నరసింహమూర్తి, టిడిపి మండల క్లస్టర్ కో కన్వీనర్ కనకనపల్లి మంజు తారక్, మాజీ సర్పంచులు పాండురంగప్ప, చంద్రప్ప, మాజీ ఎంపీటీసీ నర్సింహప్ప,టిడిపి పంచాయతీ కన్వీనర్ ఎంజారప్ప, శ్రీనివాస్, మాజీ డీలర్ ముద్దన్న, శివన్న,కుమార్, జయన్న, గిరిరాజ్, డీలర్లు దేవరాజ్ ,తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## అధికారం కోల్పోయామని జీర్ణించుకోలేక అలజడులు సృష్టించే కుట్ర చేస్తున్న వైసీపీ

మడకశిర జనవరి 20 ప్రభాతవార్త:



విలేకరులతో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

యన్ డి ఏ కూటమి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ ఆనందోత్సహాల మధ్య జరుపుకుంటుంటే వైసీపీ నేతలు మాత్రం ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టి ప్రజలను భయభ్రాంతుల్ని చేసేందుకు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారు. తుని నియోజకవర్గం కోటనందూరు మండలం అల్లీపూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, బీసీ నేత లాలం బంగారయ్య ను వైసీపీ నేతలు అతి కిరాతకంగా హతమార్చారని, అధికారం కోల్పోయామని జీర్ణించుకోలేక అలజడులు సృష్టించే కుట్రలు చేస్తున్నారు. అది ఒక రాజకీయ పార్టీ అనేది మరచిపోయి పనికిమాలిన డైలాగ్స్ రప్పా రప్పా అంటూ పిలుపునిచ్చి, దాడులకు ప్రోత్సాహించిన ఇది జగన్ రెడ్డి పార్టీ నాయకుల కుట్ర. బడుగు, బలహీన వర్గాలపై వైసీపీ నేతలు దమనకాండకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర కుంచటిగ వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ ఆదివారం విలేఖరుల సమావేశంలో తెలియజేశారు.వైసీపీ నేతలకు బీసీలంటే గిట్టదని, అంచలంచెలుగా ఎదిగి గుర్తింపు తెచ్చుకుంటున్న బీసీ నేతలను అణచివేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైసీపీ నేతలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటోంది. తప్పు చేసిన వారిని ఎవరినీ వదలిపెట్టేదిలేదు, డకు పాల్పడ్డారని, ఇప్పుడు కూడా అదే ధోరణితో వ్యవహరిస్తున్నారని, వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజ్యాంగం ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్లలో కోత పెట్టడం వల్ల 16,800 బీసీ ప్రతినిధులు రాజ్యాంగబద్ధమైన పదవులకు దూరమయ్యారని అన్నారు. బీసీ సబ్ ప్లాన్ నిధులు రూ. లక్ష కోట్లు దారిమళ్లించారు, ఆదరణ రద్దు చేశారు, బీసీలకు ఆర్థికంగా నష్టం కలిగించారు. రాజకీయ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసి ఇప్పుడు బీసీలపై వేధింపులకు పాల్పడుతున్నారు. జగన్ మోహన్ రెడ్డి కుల రాజకీయాలతో బీసీలను రాజకీయంగా నాశనం చెయ్యాలి అని పూనుకున్నాడని అన్నారు. ఇలాంటి కుట్రలు చేస్తున్న వైసీపీ ని శాశ్వతంగా అధికారానికి దూరం చేయవలసిందిగా ప్రజల కు విజ్ఞప్తి చేస్తున్నానని రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మి నారాయణ అన్నారు.

## ఈ నెల 23 నుండి హిరేతుర్పి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

గుడిబండ జనవరి 20 ప్రభాతవార్త

మండల పరిధిలో ని హిరేతుర్పి గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 వ తేదీ నుండి ప్రారంభం అవుతున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 23 నుండి 27 వ తేదీ వరకు శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ఘనంగా ఓంకారేశ్వరుని ఏడవ వార్షికోత్సవం

శివనామస్మరణతో మారమోగిన ఓంకారేశ్వరుని ఆలయం

బత్తలపల్లి,జనవరి 20 ప్రభాతవార్త



పూజలు అందుకుంటున్న శ్రీ లలితా త్రిపుర సుందరి సమేత ఓంకారేశ్వరుడు ←

ఆలయ వార్షికోత్సవంలో కలశారాధన →



మండల కేంద్రంలో ఆధునాతనంగా నిర్మించిన శ్రీలలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరుని దేవస్థానం ఏడవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఆలయ అర్చకులు విరూపాక్ష రాజేష్ స్వామి తో పాటు ఆలయ శాశ్వత ధర్మకర్త కోటి సూర్యప్రకాష్ బాబు,జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం ఏడవ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వ హించారు.తొలుత శ్రీలలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరునికి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు వివిధ పూజాకార్యక్రమాలు నిర్వహంచారు.గణపతి పూజ,గోపూజ,స్వస్తి పుణ్యహవచనం, కలశారాధన,అగ్ని ప్రతిష్టాపన,గణపతి హోమం నిర్వహించారు. సాయంకాలం రుద్రాభిషేకం, సామూహిక రుద్రహోమం నిర్వహించారు.పూజా కార్యక్రమాలకు శివదీక్ష మాలదారులతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని కరపత్రాలు విడుదల..

మడకశిర టౌన్ జనవరి 20 ప్రభాతవార్త



కరపత్రాలను విడుదల చేస్తున్న కెవిపిఎస్ నేతలు

ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని కెవిపిఎస్ ఆధ్వర్యంలో కరపత్రాలను మెళవాయి గ్రామంలో విడుదల చేశారు.ఈ సందర్భంగా సిపిఐ పార్టీ నాయకుడు రవి,జిల్లా ఉపాధ్యక్షులు రామాంజినేయులు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో అనుభవంలేని వ్యవసాయకూలీలకు ఆర్థికసంవత్సరంలో 100 రోజులు పని కల్పించాలనే ఒక మంచి ఉద్దేశంతో ఏర్పడినటువంటి చట్టం. ఈ చట్టంలో మహిళలకు సమాన పనికి సమాన వేతనం. పనిచేసిన 15 రోజులకే బిల్లు రావాలని ఉద్దేశము. మరి ముఖ్యంగా వలసలు తగ్గించాలనే అభిప్రాయంతో ఈ ఉపాధి హామీ చట్టం తీసుకురావడం జరిగింది. ఇలాంటి చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ఒక కొత్త చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం విబి జిరాంజీ అనే పేరుతో ఒక కొత్త చట్టాన్ని 2025 లో తీసుకురావడం జరిగింది. ఈ చట్టం గ్రామీణ పేదలకు కష్టజీవులకు ఇబ్బంది పెట్టాలనే దుర్మార్గమైన ఆలోచనతో ఈ బిల్లును తీసుకురావడం జరిగింది. కష్టజీవులను దెబ్బతీసేలా ప్రధాని నరేంద్ర మోడీ వ్యవహరిస్తున్న తీరు అత్యంత దుర్మార్గం అన్నారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి బి.రవి మాట్లాడుతూ ఉపాధి హామీ స్థానంలో విబిజిరాంజీ పథకం అమలు జరిగితే కేంద్రం 90శాతం నుండి 60 శాతం కు తగ్గుతుందని, రాష్ట్రాల పైన 10 శాతం నుండి 40 శాతం భారం వేయాలని ఒక ఆలోచనతో ఈ బిల్లును తీసుకురావడం జరిగింది.గ్రామానికి అవసరమైన పనులు ఎంచుకునే వీలు కేంద్రం చేతిలోకి వెళ్ళిపోతుంది. కూలీలు పనులు చేసే స్థానంలో యంత్రాలు వస్తాయి. ఈ చట్టంలో పనిచేసే కష్టజీవులకు నష్టం చేసి కార్పోరేట్లకు మేలు చేకూరుస్తుంది . కాబట్టి ఈ కొత్త పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విబి రామ్ జీ ఈ చట్టాన్ని రద్దుచేసి యధావిధిగా ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నాము.

## సచివాలయ హెల్త్ సెక్రటరీ మరణం విషాదకరం

ధర్మవరంటౌన్, జనవరి 20 ప్రభాతవార్త



దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

వై ఎస్ ఆర్ కడవ జిల్లాలోని గన్నవరం సచివాలయంలో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీ విజయంకువారి మరణం అత్యంత విషాదకరమని ఏపీవిలేజ్ వార్డు సెక్రటేరియట్ సర్వీసెస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహబూబ్ బాషా, రాష్ట్ర ప్రధానకార్యదర్శి పులిబండ్ల నరసింహారావు అన్నారు.ఈ మేరకు ధర్మవరంలో మంగళవారం ఆమె మృతిపట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులకు వారు సచివాలయ ఉద్యోగుతోకలిసి ప్రగాడసంతాపం వ్యక్తంచేశారు. స్వర్ణ గ్రామ, వార్డు ఉద్యోగులపై పెరిగిన పనిభారం, ఒత్తిడి, టార్గెట్ ప్రెజర్ వల్లే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని మా సంఘం ఆవేదనవ్యక్తం చేస్తోందన్నారు. ఉద్యోగుల ఆరోగ్యభద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పనిభారం తక్షణమే తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వర్ణ ఉద్యోగుల మరణాలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పగిలిన పైపు వృధాగా నీరు

వజ్రకరూరు జనవరి 20 ప్రభాతవార్త



రహదారిపై వృధాగా పోతున్న నీరు

మండలంలోని చాబాల గ్రామంలో నెలరోజులకు పైగా పైపు పగిలి పోయి నీరు రహదారిపై వృధాగా పారుతుంది. చాబాల పొలికి ప్రధాన రహదారి లో బీసీ కాలనీ వద్ద గ్రామంలోకి సరఫరాఅయ్యే పైపు పగిలిపోయి నెల రోజులు అవుతోంది. నీటిని సరఫరా చేసే సమయంలో అధిక భాగం నీరు రహదారిపైనే వృధాగా పారుతూ, నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్థానికులు సంబంధిత అధికారులు దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లిన మరమ్మతులు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారంటూ తీవ్రఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరా లో ఇబ్బందులు తలెత్తడంతో పాటు పరిసర ప్రాంతం బురదమయంగా మారి ఇబ్బందికరంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## వేలం దక్కించుకున్న మాజీ సర్పంచ్

రొళ్ల జనవరి20ప్రభాతవార్త:



వేలం వేసిన దృశ్యం

మండలంలోని మల్లిన మడుగు గ్రామంలోనీ బస్టాండ్ ఆవరణంలో గల చింత చెట్ల ఫలం సాయం వేలం పాట మంగళవారం నిర్వహించారు.ఈ వేలం పాట గ్రామ పంచాయతీ సర్పంచ్, గ్రామస్తుల సమక్షంలో అధికారులు బహిరంగ వేలం వేశారు. ముందుగా పలువురు వేలంపాట పాడగా చివరిగా బైరేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నరసే గౌడ్ రూ.17వేలు కు దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఆజయ్ కుమార్ తెలిపారు.

## వేమన విగ్రహానికి సహకరించిన ప్రతి చేతికి ధన్యవాదాలు

వేమన విగ్రహ అంకురార్పణ నుంచి ఆవిష్కరణ వరకు కృషి చేసిన అందరికీ రుణపడి ఉంటాము.

గోరంట్ల జనవరి 20 ప్రభాత వార్త



గోరంట్ల పట్టణంలో విశ్వ కవి శ్రీ యోగి వేమన విగ్రహం అంకురార్పణ నుండి ఆవిష్కరణ వరకు కృషి చేసిన రెడ్డి సోదరులందరికీ మరియు విగ్రహం ఏర్పాటు కొరకు స్థలం కేటాయింపుకు సహకరించిన చేనేత మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు సవితమ్మ కి , గోరంట్ల మండలంలో రెడ్డి సోదరుల ఆధ్వర్యంలో నిర్మించబోవు కళ్యాణ మండపం కొరకు 60 లక్షల రూపాయల తన ఎంపీ నిధులు ప్రకటించిన హిందూపురం పార్లమెంటు సభ్యులు శ్రీ బికె పార్థసారథి కి, రెవెన్యూ అధికారి తాసిల్దార్ మారుతి ప్రసాద్ మరియు వారి బృందానికి, మరియు పంచాయతీ అధికారులకు, పోలీస్ అధికారి సీ.ఐ. బోయ శేఖర్ మరియు వారి బృందానికి, ఉమ్మడి అనంతపురం జిల్లా నుండి ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులు అందరికీ మరియు 90 రోజుల పాటు ఈ కార్యక్రమం కోసం సొంత పనులు వదులుకొని అహర్నిశలు పాటుపడిన రెడ్డి సోదరులకు, గోరంట్ల మండలంలో ఉన్న ప్రతి రెడ్డి సోదరులు విరాళం అందజేయడమే కాకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు వారికి , ఎంతో అద్భుతంగా విగ్రహాన్ని తయారుచేసిన శిల్పి కి శ్రీ యోగి వేమన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి సేవలందించిన అన్ని వర్గాల వారికి మరియు ప్రత్యేకంగా పై కార్యక్రమాలను ప్రజల చెంతకు చేరవేర్చిన మీడియా మిత్రులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

## రీ సర్వే లో భూ సమస్యలు వెంటనే పరిష్కరించండి: ఆర్డీఓ మహేష్

తాడిమర్రి జనవరి 20 (ప్రభాతవార్త)



తాసిల్దార్ కార్యాలయంలో ఫైల్ తనిఖీ చేస్తున్న ఆర్డీవో మహేష్

తాడిమర్రి మండల తాహసిల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆర్డీఓ మహేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి, అనంతరం తాసిల్దార్ భాస్కర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బందితో కలిసి అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో ఆర్డీఓ మహేష్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. సేవల్లో జాప్యం వద్దు రైతులు, మండల ప్రజలు తమ సమస్యల నిమిత్తం కార్యాలయానికి వచ్చినప్పుడు వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, పనులలో జాప్యం లేకుండా విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అందుబాటులో వీఆర్వోలు గ్రామ రెవెన్యూ అధికారులు తమకు కేటాయించిన సచివాలయాల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. స్థానికంగా ఉంటూ క్షేత్రస్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. త్వరితగతిన పరిష్కారం తాహసిల్దార్ కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా పని చేయాలని ఆయన సిబ్బందిని కోరారు. ఈ సమావేశంలో తాహసిల్దార్ భాస్కర్ రెడ్డితో పాటు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సోమశేఖర్‌ను పరామర్శించిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

కనగానపల్లి జనవరి 20 ప్రభాతవార్త



సోమశేఖర్ ను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

మండలంలోని వేపకుంట గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు జడ్పీ హైస్కూల్ మాజీ ఛైర్మన్ దివిటి సోమశేఖర్ అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న హిందూపురం మాజీ పార్లమెంట్ సభ్యులు, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి సోమశేఖర్‌ను పరామర్శించి ఏ అవసరం వచ్చినా తాను కానీ వైసీపీ పార్టీ గాని అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అక్కడ డాక్టర్లను మెరుగైన వైద్యం అందించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో నసనకోట ముత్యాలమ్మ స్వామి కమిటీ మాజీ ఛైర్మన్ కురుబ ముత్యాలు, వైసీపీ నాయకులు మాజీ ఎంపీ వెంట వచ్చిన వారిలో ఉన్నారు.

## కలెక్టర్ ను కలిసిన ఏపీఎన్జీవో నాయకులు

పుట్టపర్తి రూరల్ జనవరి 20 ప్రభాతవార్త :



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఎన్జీవో నాయకులు

సత్యసాయి జిల్లా ఏపీ ఎన్జీవో నాయకులు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం కలెక్టరేట్లో ఎన్జీవోల అధ్యక్షుడు లింగ రామ్మోహన్, కార్యదర్శి ఈశ్వర్ నాయక్, ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్యాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన జిల్లా కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఏపీఎన్జీవోస్ నూతన డైరీ ని మరియు క్యాలెండర్ ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి తాలూకా బి. దేవేంద్ర, కార్యదర్శి లి. సూర్యనారాయణ. కదిరి తాలుకా అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, ఎన్జీవోస్ జిల్లా నాయకులు ఈశ్వరప్ప , రామమోహన్,గఫ్పూర్, రాజేష్, రాజు, సిభితుల్ల, రాజేశ్వరి, హరీషా, ఈశ్వర్, శ్రీధర్, జనార్ధన్, మురళీ కృష్ణ, అరుణ, శివయ్య మహి ళా విభాగం సభ్యులు రాజేశ్వరి, పరిమిల, హరీషా,పాల్గొన్నారు..

## అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

### మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్



అక్రమంగా నిర్మించిన షెడ్డును తొలగిస్తున్న పట్టణ ప్రణాళిక సిబ్బంది

పెనుకొండ జనవరి20 (ప్రభాతవార్త)

అనుమతులు లేకుండా పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో అక్రమనిర్మాణాలు చేపడితే ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీ చట్టం 1965 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెనుకొండ మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్ తెలిపారు.పెనుకొండ పట్టణంలోనీ మెయిన్ రోడ్డు కోటగోడకు సమీపంలో అక్రమంగా నిర్మించబడుతున్న షెడ్ ను మంగళవారం నగర పంచాయతీ పట్టణ ప్రణాళిక సిబ్బంది, పురావస్తు శాఖ అధికారులు సంయుక్తంగా తొలగించారు.దీంతో మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో నూతనంగా ఏవైనా షెడ్లు లేదా భవనాలు నిర్మించదలుచుకున్న నిర్మాణదారులు తప్పనిసరిగా నగరపంచాయతీ వారినుండి ముందస్తు అనుమతులు తీసుకోవాలని ప్రకటనద్వారా తెలిపారు. అదేవిధంగా నిషేధితప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టదలిచిన వారు సంబంధిత శాఖ నుండి ఎన్వోసీ పొందవలసింది ఉంటుందని తెలిపారు. అనుమతుల పొందకుండా అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన నిర్మాణదారులపై ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ చట్ట ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ప్రకటన ద్వారా హెచ్చరించారు.

## గవిమఠం సహాయ కమీషనర్‌గా గంజి మల్లికార్జున ప్రసాద్

**- జిల్లా సహాయ కమీషనర్‌కే పూర్తి అదనపు బాధ్యతలు అప్పగింత**

**- 2007-09 మధ్య గవిమఠం రెగ్యులర్ ఏసీగా బాధ్యతల నిర్వహణ**

ఉరవకొండ, జనవరి 20 ప్రభాతవార్త



గంజి మల్లికార్జున ప్రసాద్ (ఫైల్‌ఫోటో)

ఉరవకొండ పట్టణంలోని ప్రసిద్ధ గవిమఠం సంస్థానం సహాయ కమీషనర్‌గా గంజి మల్లికార్జున ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు దేవాదాయ ధర్మాదాయశాఖ రాష్ట్ర కమీషనర్ ఉత్తర్వులు వెలువరించారు. ప్రస్తుతం ఆయన దేవాదాయ ధర్మాదా యశాఖ జిల్లా సహాయ కమీషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గవిమఠ సంస్థానానికి దేవాదాయశాఖ ఉరవకొండ డివిజనల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న కె.రాణి ఇప్పటివరకు సహాయ కమీషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మరో నెల రోజుల్లో గవిమఠ సంస్థానం లో కొలువైన చంద్రమౌళీశ్వరస్వామి (కరిబసవస్వామి) బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో మార్పులు, చేర్పులు చోటు చేసుకోవడం విశేషంగా చెప్పాలి. కాగా గంజి మల్లికార్జున ప్రసాద్ గత 2007 నుండి 2009 వరకు గవిమఠానికి సహాయ కమీషనర్‌గా బాధ్యతలు నిర్వహించి ఉండటంతో ఆయన అనుభవం గవిమఠ సంస్థానం అభివృద్ధికి దోహదపడుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గుంతకల్లు డివిజన్‌లో భద్రతా తనిఖీలు

**రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీ వాస్తవ డోన్, పాణ్యం రైల్వే స్టేషన్ స్టేషన్ల అభివృద్ధి పనులు పరిశీలన..**

గుంతకల్ రైల్వే, జనవరి 20 ప్రభాతవార్త



తనిఖీలు నిర్వహించన రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

గుంతకల్ రైల్వే డివిజన్ లో భద్రతా తనిఖీలు నిర్వహించిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం గుంతకల్లు డివిజన్ పరిధిలోని బళ్లారి నుండి గుంతకల్లు మరియు డోన్, నంద్యాల సెక్షన్‌లో భద్రతా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో చీఫ్ సేఫ్టీ అధికారి వెంకటరమణ రెడ్డి మరియు గుంతకల్లు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్ర ఎస్. గుప్తా ఎడిఆర్ఎం యు.సుధాకర్ మరియు ప్రధాన శాఖాధికారులు మరియు హెడ్‌క్వార్టర్స్, డివిజన్‌కు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు .జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బళ్లారి నుండి విండో ఇన్‌స్పెక్షన్‌ను ప్రారంభించి, రైల్వే ట్రాక్‌ల భద్రతా అంశాలు (వంక నెం. 19 - కి.మీ 283 వంక నెం. 22 - కి.మీ 238), లెవల్ క్రాసింగ్‌లు (లిది 118 లిది 154), సిగ్నలింగ్ వ్యవస్థ, వంతెనలు మరియు ముఖ్య స్టేషన్లను పరిశీలించారు. అలాగే గేట్‌మ్యాన్‌లతో పని పరిస్థితులపై చర్చించారు. గుంతకల్లు వద్ద మెడికల్ రిలీఫ్ వాన్, యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్‌ల తనిఖీ చేశారు. మరియు అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన భద్రతా సెమినార్‌లో పాల్గొని, ఆటోమేటిక్ సిగ్నలింగ్ మరియు రైట్ హ్యాండ్ సిగ్నల్స్ (ఆర్‌బీఎస్) స్థలాలపై అవగాహన పత్రికలను విడుదల చేశారు. అదేవిధంగా గుంతకల్లు స్టేషన్‌లోని క్రూ లాబీని సందర్శించి లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లతో పరస్పర చర్య జరిపి, రన్నింగ్ రూమ్‌లో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా రూ. 46.41 కోట్ల వ్యయంతో అమృత్ స్టేషన్ పథకం కింద కొనసాగుతున్న దోన్ మరియు పాణ్యం రైల్వే స్టేషన్ పనులను జనరల్ మేనేజర్ పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల కోసం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. స్టేషన్‌లో ప్లాట్‌ఫారమ్‌లపై ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించి, దివ్యాంగుల మరుగుదొడ్లను తనిఖీ చేశారు. డోన్ రైల్వే స్టేషన్ లో స్థానిక ఎమ్మెల్యే సూర్య ప్రకాష్ రెడ్డి మరియు పలువురు ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను కలిసి స్థానిక అవసరాలను నిమిత్తం వినతిపత్రాలు సమర్పించారు. రైల్వే ఉద్యోగులతో పరస్పర చర్చలు జరిపి, ఆపరేషనల్ సమస్యలపై తెలుసుకొని, వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఉన్నతాధికాలతో పాటు రైల్వే ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పెల్ బీ పోటీలు..

కొత్తచెరువు జనవరి 20 ప్రభాతవార్త

శ్రీ సత్య సాయి జిల్లా లో ఆరవ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీష్ భాషలో స్పెల్ బీ పోటీలు కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించబడతాయని డీఈవో జి కృష్ణప్ప ఓ ప్రకటనలో తెలిపారు జిల్లాలో అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్, కేజీబీవీ మోడల్ స్కూల్ సాంఘిక సంక్షేమ పాఠశాలల విద్యార్థులు తరగతి కి ఒక్కరు చొప్పున పాల్గొనాలని జిల్లా పరీక్షల మండలి సెక్రటరీ గోపాల్, జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ లు తెలిపారు మరిన్ని వివరాలకు 9492843184 నెంబర్లు సంప్రదించండి

## నితిన్ నబీన్ ఎన్నికపై సంబరాలు చేసుకున్న బీజేపీ నాయకులు...!

ధర్మవరం, జనవరి 20 (ప్రభాతవార్త)



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

బీజేపీ జాతీయ అధ్యక్షులుగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎంపిక కావడంతో ధర్మవరం బీజేపీ కార్యాలయం వద్ద మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు,కార్యకర్తలు కలిసి స్వీట్లను తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాస్కర్ నాయక్ మాట్లాడుతూ... బీజేపీలో సాదారణ కార్యకర్త కూడా జాతీయ అధ్యక్షులు కాగలరని ఇందుకు నితిన్ నబీన్ ఒక ఉదాహరణ అన్నారు.చిన్న వయసు 45ఏళ్లకే అధ్యక్షుడు కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఉమ్మడి బీహార్ నుంచి పార్టీ అధ్యక్షులు అయిన మొదటి వ్యక్తి నితిన్ నబిన్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి సాకే ఓబుళేశు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు అనిల్ గౌడ్, మైనార్టీ మోర్చా అధ్యక్షులు పెక్రావలి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఓం ప్రకాశ్ గౌడ్, మధుబాబు, మైనార్టీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శినబీరసూల్, పట్టణ అధ్యక్షులు జింక చంద్ర, పట్టణ ఉపాధ్యక్షులు నాగభూషణ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

